

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

## వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్ గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand@hotmail.com**

## పరోమ

**భాష:** బెంగాలి, **దర్శకత్వం** – అపర్నాసేన్; **సినిమాటోగ్రఫీ** – అశోక్ మెహతా; **సంగీతం** – భాస్కర్ చందావర్కర్;

**నటీనటులు** – రాఖీ, ముకుల్ శర్మ

**విడుదల:** 1984




ఆ ఇంట్లో పరోమ తల్లిగా, భార్యగా కోడలిగా ఇంకా అనేక రకాల బాధ్యతలతో సౌకర్యవంతమయిన జీవితాన్ని గడుపుతూ ఉంటుంది. ఉన్నత వర్గానికి చెందిన ఆ కుటుంబంలో ఆమెది ప్రధాన పాత్ర. ఆ ఇంట్లో ప్రతి సందర్భానికి ఆమె కేంద్ర బిందువుగా ఉంటుంది. అయితే ఆమెనెవరూ ఆ ఇంట్లో ఆమె పేరుతో పిలవరు. ఏదో ఒక బంధుత్వపు పేరుతోనే పిలుస్తారు. ఆమె తన పేరునే కాదు తన ఇష్టాల్ని, తనదైన వ్యక్తిత్వాన్ని ఏనాడో మరిచిపోయింది. తానే ఇల్లుగా ఇంట్లోని వారి అవసరాల్ని చూడ్డమే తన జీవితంలా ఆమె రూపాంతరం చెందిపోతుంది. మధ్య వయస్సులోనూ అందంగా ఉన్న పరోమ

జీవితంలోకి పెనుతుఫానులా వచ్చిన మార్పులు ఆమె అంతరంగంలో నిక్షిప్తమయి ఉన్న వ్యక్తిత్వపు ఛాయల్ని వెలికితీస్తాయి. ఆమె తనను తాను గుర్తెరిగే స్థితి ఎదురవుతుంది. ఒక వ్యక్తిలా ఒక స్త్రీలా ఆలోచించడానికి అనుభూతించడానికి ఆమెకు కొత్త ద్వారాలు తెరుచుకుంటాయి. సరిగ్గా ఆ మలుపుతోనే అంతదాకా నిశ్చలంగానూ, సురక్షితంగానూ ఉన్నట్టు కనిపించిన కుటుంబంలో గోడలు బీటలు వారతాయి.

పరోమ తన ఆసక్తుల్ని కోరికల్ని గమనించడమే మొత్తం కల్లోలానికి దారితీస్తుంది. ఒక స్త్రీ అంతరంగపు ఆవిష్కరణ ఆమె జీవితంపైన, అప్పటిదాకా ఆమె చుట్టూరా పరుచుకుని ఉన్న బంధాల బోలుతనంపైన, అప్పటిదాకా ఆమె చుట్టూరా పరుచుకుని ఉన్న బంధాల బోలుతనంపైనా కలిగించే ప్రభావాన్ని అత్యంత ప్రతిభావంతంగా చిత్రించిన చిత్రం 'పరోమ'. అపర్నాసేన్ నిర్దేశకత్వంలో నిర్మితమైన ఈ చిత్రం దేశంలో పెద్ద దుమారాన్ని లేవదీసింది. అనేక చర్చోపచర్చలూ జరిగాయి. ఇప్పుడు ప్రముఖ ఫెమినిస్టు సినిమాగా సినీ విమర్శకుల చేత మన్ననలందుకుంటున్న 'పరోమ' 1986 హైదరాబాద్ లో జరిగిన ఫిల్మోత్సవ్ లో ప్రదర్శితమైంది. స్త్రీ భావస్వేచ్ఛని, వ్యక్తిత్వ అవలోకనాన్ని అపర్నాసేన్ సున్నితమైన కథ ద్వారా విశ్లేషించి చూపారు.

తల్లిలా, ఇల్లాలిలా ఇంకా అనేక రూపాలుగా ఇంటినీ కుటుంబాన్ని మోసిన స్త్రీ తనలోకి తాను చూసుకోవడం మొదలు పెడితే తనను తాను స్థిరీకరించుకునేందుకు యత్నిస్తే మొత్తంగా కుటుంబమూ, సమాజమూ ఎంతలా కల్లోలపడిపోతాయో పరోమాలో అపర్నాసేన్ అద్వితీయంగా చూపించారు. చిత్రంలో కథ విషయానికి వస్తే పరోమ ఓ అందమైన మధ్య వయస్కురాలు. తన కుటుంబంలో సంపూర్ణంగా నిమగ్నమయిపోయి ఉంటుంది. ఒక రోజు పరోమకు ఆమె మరిది స్నేహితుడు రాహుల్‌తో పరిచయమవుతుంది. ఇంట్లో ఓ ఫంక్షన్ జరిగితే ఫోటో గ్రాఫర్ అయిన రాహుల్ ఫోటోలు తీస్తాడు. అతడు తీసిన ఫోటోల్లో పరోమ ప్రత్యేకంగా అందంగా కనిపిస్తుంది. ఇంట్లో వారంతా ఫోటోల్ని, పరోమని మెచ్చుకుంటారు. కానీ ఆమె కొంత ఇబ్బందిగా ఫీలవుతుంది. మరో రోజు రాహుల్ పరోమ ఫోటోల్ని ప్రత్యేకంగా తీస్తానంటాడు. కాని ఆమె అంగీకరించదు. ఇంట్లో వారంతా బలవంతంగా ఒప్పిస్తారు. మరో రోజు రాహుల్ వచ్చి పాత నగరం చూడ్డానికి వెంట రమ్మని పరోమని కోరతాడు. ఇంట్లో అత్తగారితో సహా అంతా రాహుల్ తో వెళ్ళమని పురమాయిస్తారు.

రోజంతా రాహుల్‌తో దగ్గరగా ఉండి తిరగడం పరోమకి సంతోషం కలిగిస్తుంది. ఆమెలో కదలిక ఆరంభమవుతుంది. రాహుల్ పరోమని పేరుతో సంబోధిస్తాడు. అప్పటిదాకా తన పేరునే మర్చిపోయిన స్థితిలోంచి క్రమంగా పరోమ తనని తాను తెలుసుకోవడం ఆరంభిస్తుంది. రాహుల్‌ని తన అమ్మవారింటికి తీసుకెళుతుంది. అక్కడ చిన్ననాడు తాను కన్నకలలు గడిపిన కాలం ఆమెకు గుర్తొస్తుంది. బంగ్లాపైన గదిలో ఆంటీని ఒంటరిగా బంధించిన సంఘటన గుర్తొస్తుంది. శిధిలమైన ఆ గదిలోకి వెళ్ళిన పరోమ భయంతో వెనక్కి తిరుగుతుంది. వణికిపోతున్న ఆమెను రాహుల్ పొదివి పట్టుకుంటాడు. అక్కడి నుంచి ఇల్లు చేరిన పరోమ తనలో వచ్చిన మార్పుపట్ల ఆందోళన చెందుతుంది. వ్యాపారం కోసం ఊరెళ్ళిన భర్త భాస్కర్ తిరిగి వస్తే బాగుండు అనుకుంటుంది. రమ్మని ఫోన్ కూడా చేస్తుంది. పనిలో ఉండి భాస్కర్ రాలేను అంటాడు. తన బ్యాగ్ తీసిన పరోమ అందులో రాహుల్ కెమెరా లెన్సులు, పర్స్ ఉండడం గమనిస్తుంది.

తన మిత్రురాలు షీలా ఇంటికి వచ్చి వాటిని తీసుకెళ్ళమని రాహుల్‌కి ఫోన్ చేసి చెబుతుంది. ఒంటరిగా ఉంటూ ఉద్యోగం చేసుకుంటున్న షీలా ఇంటికి పరోమ వెళుతుంది. అప్పటికి షీలా ఇంట్లో ఉండదు. ఇంతలో రాహుల్ అక్కడికి చేరుకుంటాడు. ఒంటరి స్థితిలో రాహుల్ పరోమ ఒకటవుతారు. ఆ తర్వాత రాహుల్‌ని పరోమ క్రమంగా కలుసుకుంటూ ఉంటుంది. కొంతకాలానికి రాహుల్ విదేశాలకు వెళ్ళిపోతాడు. వెళుతూ వెళుతూ రాహుల్ పరోమకి ఓ పూల కుండీని బహుమతిగా ఇచ్చి వెళతాడు. ఆ తర్వాత పరోమ తన యాంత్రిక జీవితంలో తిరిగి ఎప్పటిలా ఉండలేకపోతుంది. భర్తతో ఎప్పటిలా కలవలేకపోతుంది. రాహుల్ షీలా ఇంటికి ఉత్తరం రాస్తాడు.

కొంతకాలానికి రాహుల్ ఒక మాగజైన్ పంపిస్తాడు. అందులో పరోమ అందమయిన ఫోటోలు అచ్చయి ఉంటాయి. వాటిని చూసి భాస్కర్ గొడవ చేస్తాడు. ఆమెను ఇంట్లో అంతా తీవ్రమయిన నిరాదరణకు గురిచేస్తారు. ఆమెను చెడుగా భావిస్తారు. పరోమ ఒంటరిదైపోతుంది.



షీలాని కలిసి ఏదైనా ఉద్యోగం చూపించమంటుంది. రాహుల్‌కి విదేశాల్లో ఆక్సిడెంట్ అయిన విషయం తెలిసి పరోమ షాక్‌కు గురౌతుంది. ఆత్మహత్య ప్రయత్నం చేస్తుంది. వైద్య సహాయం అంది బతుకుతుంది. ఆమెకు మానసిక చికిత్స అవసరమని వైద్యులు చెబుతారు. ఇంట్లోనే ప్రత్యేక గదిలో ఉంచుతారు. తాను ఎలాంటి తప్పు చేయలేదంటుంది. ఇంతలో షీలా పరోమకి రాహుల్ ఇచ్చి వెళ్ళిన కుండీలోని మొక్క వికసించడం కనిపిస్తుంది. ఆమె కూతురు ఆమె చెంతనే కూర్చుని ప్రేమగా చూస్తూ ఉంటుంది. వికసిస్తున్న మొక్క పరోమ మానసిక స్థితికి,చెంతనున్న కూతురు భవిష్యత్తరాలకు గుర్తుగా కనిపిస్తుండగా చిత్రం ముగిస్తుంది. అప్పటి కాలానికి అత్యంత వివాదాస్పదమయిన అంశాన్ని తీసుకుని అపర్నాసేన్ విలక్షణమైన చిత్రాన్ని నిర్మించారు. పరోమ పాత్రలో రాఖీ ఉదాత్తమయిన, ఉత్తేజ భరితమయిన నటనని ప్రదర్శించింది.

✡✡✡

## ఉంబర్తా

**భాష:** మరాఠీ, **కథ** - శాంతామిసాల్; **సంగీతం** - హృదయనాధ్ మంగేష్కర్, **స్క్రీన్ ప్లే** - విజయ్ టెండూల్కర్; **దర్శకత్వం** - జబ్బర్ పటేల్; **నటీనటులు** - స్మితాపాటిక్, గిరీష్ కర్నాడ్, ఆశాలత

**విడుదల:** 1981




ఉద్యోగస్తురాలయిన మహిళ జీవితంపైన, ఆమె ఈ వ్యవస్థలో ఎదుర్కొంటున్న సమస్యలు, అనుభవిస్తున్న సంఘర్షణలపైన భారతీయ చలనచిత్ర సీమలో నిర్మితమైన అతి కొద్ది చిత్రాల్లో 'ఉంబర్తా' ప్రముఖమైంది. వర్కింగ్ ఉమన్ జీవన స్థితిగతులపైన సరైన దృక్కోణంలోంచి మరాఠీలో నిర్మితమయిన చిత్రమిది. 'డాక్టర్ అంబేద్కర్' చిత్ర నిర్మాణంతో ప్రముఖ దర్శకుల జాబితాలోకి చేరిన డాక్టర్ జబ్బర్ పటేల్ 1982 లో 'ఉంబర్తా'కి దర్శకత్వం వహించారు. శాంతా మిసాల్ రాసిన మరాఠీ నవల 'బేఘర్' ఆధారంగా ఈ చిత్రం రూపొందించబడింది. 'ఉంబర్తా' ఆ తర్వాత 'సుభా'గా హిందిలో కూడా నిర్మించబడింది.

కుటుంబ వాతావరణంలో నాలుగు గోడలమధ్య నివసిస్తున్న సులభా ఆ ఇంటి గడప (ఉంబర్తా) దాటి విశాలమయిన సమాజంలోకి ఉద్యోగినిగా అడుగుపెడుతుంది. తనదైన ఆలోచనతో, వ్యక్తిత్వంతో బయటి ప్రపంచాన్ని పరిశీలించినప్పుడు అక్కడ ఆమె ఎదుర్కొన్న సమస్యలు, అక్కడి నుంచి తిరిగి ఇల్లు చేరుకున్నప్పుడు తన వాళ్ళనుకున్న వారి నుంచి ఎదురయిన నిరాదరణ, ఈ రెండూ భిన్నమయిన స్థాయిలో ఉండడాన్ని ఈ చిత్రం నిజాయితీగా చిత్రిస్తుంది



కుటుంబ సంబంధాల్లో వేళ్ళూనికుని ఉన్న పితృ స్వామ్య అధిపత్యమూ, సామాజిక సంబంధాల్లో నిలువెత్తుగా పెనవేసుకుని ఉన్న రాజకీయార్థిక సంబంధాల్ని 'ఉంబార్తా' చర్చకు తెస్తుంది. భిన్నంగా కనిపించే ఈ రెంటిలోనూ అంతర్లీనంగా ఉండే అణిచివేత లక్షణాల్ని అనుభవించి చైతన్య భరితమైన సామాజిక జీవనంవైపు మొగ్గు చూపించిన సులభా జీవితావిష్కారమే ఈ చిత్రం.

భారతీయ నవ్య సినిమా రంగానికి మరాఠీ సినిమా అందించిన మంచి దర్శకుడు జబ్బార్ పటేల్, వృత్తిరీత్యా డాక్ట అయిన పటేల్‌కు మరాఠీ భాషలో ఉండే సొగసు, అక్కడి సాహిత్యం, సంగీతం ఎక్కువ ఇష్టం. జానపద రంగంలో విశేషంగా పనిచేసిన ఆయన తొలిరోజుల్లో నాటక రంగంపైన అధికంగా కృషి చేసారు. ఆ తర్వాత విశాలవేదికగా భావించి సినిమా రంగంవైపు దృష్టి మరల్చారు. ఆయన మొదట సామ్నా, జైత్ రేజైత్, సింహాసన్ చిత్రాలు నిర్మించారు. ఆయన దర్శకత్వం వహించిన అన్ని చిత్రాల్లోనూ సామాజికాంశాలే కథాంశాలయ్యాయి.

'ఉంబర్తా' విషయానికి వస్తే సులభ పెళ్ళైంతర్వాత సోషల్ వర్క్‌లో డిప్లొమా పూర్తి చేస్తుంది. అప్పటికే సామాజిక సేవారంగంలో లబ్ద ప్రతిష్టురాలయిన సులభ అత్తగారు ఆమెను తన కార్యకలాపాల్లోకి రమ్మని, తనకు చేదోడు వాదోడుగా ఉండమని ఆహ్వానిస్తుంది. కాని సులభ తన జీవితం పట్ల, అభీష్టాల పట్ల అప్పటికింకా సందిగ్ధావస్థలోనే ఉంటుంది. అందుకే ఇతమిద్దంగా ఎటూ తేల్చుకోలేక పోతుంది. ఆమెకు ఆమె భర్తపైనా, తమ అయిదేళ్ళ కూతురు పైనా అమితమయిన ప్రేమ. కాని ఆమె కూతురును ఆమె బావగారు, ఆయన భార్య అత్యంత ఇష్టంగా చూసుకుంటారు. పిల్లల్లేని వారికి సులభ కూతురంటే అభిమానం. ఈ స్థితిలో సులభకు దూరంగా ఉన్న పట్టణంలో పనిచేస్తున్న మహిళాశ్రమం నుంచి ఉద్యోగావకాశం కలిపిస్తూ అపాయింట్‌మెంట్ ఆర్డర్ వస్తుంది. ఆ మహిళాశ్రమం అనాధులయిన మహిళల్ని రక్షించి ఉపాధి కల్పించేందుకు శిక్షణా కేంద్రంగా పనిచేస్తూ ఉంటుంది. ఉద్యోగానికి వెళతానని సులభ తన నిర్ణయాన్ని ప్రకటించడంతో ఇంట్లో ఒక విభ్రాంతికరమయిన వాతావరణం నెలకొంటుంది. బయటకు వ్యక్తంగాని ఒక తీవ్ర వ్యతిరేకత పొడసూపుతుంది. ఆమె ఇల్లు వదిలి వేరే పట్టణానికి ఉద్యోగానికి వెళ్ళడాన్ని ఇంట్లో వాళ్ళెవరూ హర్షించలేరు. సులభ భర్త మాత్రం అయిష్టంగానే ఆమె ఒత్తిడి మీద అంగీకరిస్తాడు. కుటుంబంలో అప్పటిదాకా ఒక రకమయిన జీవితాన్ని గమనించిన సులభకి మహిళాశ్రమంలో నెలకొని ఉన్న తీవ్రమయిన పరిస్థితులు ఆందోళనకు గురిచేస్తాయి. అక్కడ జరుగుతున్న చీకటి కార్యక్రమాలు, లంచగొండితనం ఆమెకు ఊపిరి సలపనివ్వవు. మహిళాశ్రమం నిర్వాహకుల అసలు రంగు ఆమెకు తెలిసి పోతుంది. అమాయకులు, నిరాశ్రయులు, దగాపడిన స్త్రీలు అయిన ఆశ్రమ వాసులపై జరుగుతున్న దోపిడీ సులభని కలిచివేస్తుంది. అక్కడ బలవంతంగా జరుగుతున్న వ్యభిచారం, దొంగరవాణా, దారి తప్పిన సెక్స్ సంబంధాలు, ఫలితంగా ఆశ్రమ వాసుల ఆత్మహత్యలు, ఉన్మత్తత ఆమెను

దిగ్భ్రమకు గురిచేస్తాయి. మహిళాశ్రమం మేనేజింగ్ కమిటీ సభ్యుల ఆడంబరం, అత్యాశ ఆమెకు అర్థమవుతాయి. ఇవన్నొకవైపుంటే మరోవైపు ఆశ్రమంలోని మహిళలు ఆమె పట్ల చూపిన ప్రేమ, దగ్గరితనం వారికి మరింత చేరువ చేస్తాయి.

సులభ క్రమంగా మహిళా శ్రమ కమిటీ అక్రమాలపై ఎదురు తిరుగుతుంది. తన చాకచక్యంతో, పనితనంతో కమిటీని లొంగదీస్తుంది. క్రమంగా ఆమె కృషి ఫలితం ఆశ్రమంలో మంచి రోజులు మొదలవుతాయి. ఇలా రెండేళ్ళకాలం గడిపిన సులభ తిరిగి ఇల్లు చేరుతుంది. కాని ఇంట్లో వాళ్ళకు తనకు మధ్య పెరిగిన దూరం ఆమెను కలిచివేస్తుంది. తిరిగి వారితో ఆమె ఎప్పట్లాగే కలవలేకపోతుంది. ఇంట్లో వారి నుంచి అవమానాలు, తిరస్కారాలు చవిచూసింతర్వాత ఇక తనకా ఇంట్లో స్థానం లేదని తెలుసుకుంటుంది. తాను ఆశించిన ప్రేమ, అభిమానం వారినుంచి అందుకోలేనన్న వాస్తవం ఆమె కలచివేస్తుంది. ఇంట్లో వారికి అనుకూలవతి అయితే తప్ప అక్కడ తనకు స్థానం లేదని తెల్సిపోతుంది. వ్యక్తిత్వంతో ఆలోచించడం, ఆచరణలోకి దిగడాన్ని కుటుంబ సభ్యులెవరు హర్షించలేరని ఆమెకు తెలిసి వస్తుంది. ఇక ఆ ఇంట్లో తనకు స్థానం లేదని ఆమెకు అవగతమవుతుంది. నిశ్చలమయంగా కనిపించే ఆ కుటుంబంలో తన అవసరం తన భర్తకు, తన కూతురుకు కూడా లేదని గమనించిన సులభ తిరిగి కుటుంబం గడప దాటుతుంది. తనకు తానుగా నిర్మించుకున్న చైతన్యవంతమయిన జీవితం వైపు పయనమవుతుంది. మరింత ప్రేమతో, అంకిత భావంతో ఆపన్నులకు సేవ చేసేందుకు సులభ ‘ఉంబర్తా‘ దాటుతుంది. విశాల సమాజంలోకి ఒక సంపూర్ణ వ్యక్తిగా, శక్తి సంపన్నురాలిగా అడుగుపెడుతుంది.

ఇలా వ్యక్తిగతమయిన అనుభవాలకూ, చైతన్యాలకూ, పితృస్వామ్య రాజకీయానికి మధ్య ఉన్న సంఘర్షణని ఉంబర్తా ప్రతిభావంతంగా ఆవిష్కిస్తుంది. ఇంటి ‘గడప‘కు లోపలా బయటా ఉన్న భిన్నమయిన విలువలూ, ఆధిపత్యాలు వాటితో చైతన్య శీలి అయిన స్త్రీ చేసే సంఘర్షణ ఈ చిత్రానికి ఆయువుపట్టు. ఇతివృత్త కథనాల పరంగా ఈ చిత్రం విజయవంతమైంది. కాని సినిమా నిర్మాణ పరంగా లిరికల్ సెన్సిబిలిటీని, సినిమాటిక్ ఈస్థటిక్స్‌ని ఈ చిత్రం అందుకోలేకపోయింది. నాటక రంగం నుంచి వచ్చిన జబ్బర్ పటేల్ చిత్ర నిర్మాణ రీతిలో స్టేజి ప్రభావం స్పష్టంగా గోచరిస్తుంది. కథ కుటుంబ, సామాజిక స్థితిగతుల పరంగా భిన్నమయిన స్థాయిలో ఉన్నప్పటికీ కథనం సాఫీగా సాగిపోతుంది. సులభ గృహిణిగానూ, తనదైన వ్యక్తిత్వాన్ని సంతరించుకునే క్రమం ముఖంలో స్పష్టంగా కనిపిస్తాయి. దుఃఖమూ, చైతన్యమూ రెండూ ఆమె ముఖంలోనూ, కదలికల్లోనూ సాధికారికంగా ఆవిష్కృతమవుతాయి. స్మితాపాటిల్ చలన చిత్రయాత్రలో ‘ఉంబర్తా‘ ఓ మైలురాయి.

✡✡✡